సాక్షి నల్లగొండ

ఆదివారం । 23 । మార్చి । 2025



సుందరీమణులు మెచ్చేలా

ప్రపంచ సుందరీమణులు మెచ్చేలా సాగర్‌లో ఏర్పాట్లు ఉండాలని పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ సూచించారు. - 8లో



కొత్త చిక్కులు

రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవడంలో అవాంతరాలు ఎదురవుతున్నాయి. - 8లో



న్యూస్‌రీల్

సైనికదళంలో ఉద్యోగాలకు దరఖాస్తులు

నల్లగొండ : భారత సైనిక దళంలో ఉద్యోగాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తునట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎస్.పద్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అగ్నివీర్ పథకం కింద జనరల్, టెక్నికల్, క్లర్క్, స్టోర్ కీపర్ టెక్నికల్, ట్రేడ్స్‌మెన్‌గా చేరవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గల పురుష అభ్యర్థులు పూర్తి వివరాలను www.joi nindianarmy.nic.in వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని ఆమె తెలిపారు.

మానసిక దివ్యాంగులకు అండగా న్యాయ వ్యవస్థ



మాట్లాడుతున్న జిల్లా జడ్జి నాగరాజు

రామగిరి (నల్లగొండ) : మానసిక దివ్యాంగులకు న్యాయవ్యవస్థ అండగా ఉంటుందని జిల్లా జడ్జి ఎం.నాగరాజు అన్నారు. శనివారం నల్లగొండలోని న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో మానసిక దివ్యాంగుల హక్కుల రక్షణకు నిర్వహించిన ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మానసిక దివ్యాంగులకు న్యాయసేవాధికార సంస్థ ఉచిత న్యాయ సహాయం అందిస్తుందన్నారు. వారి హక్కులను న్యాయస్థానాల ద్వారా కాపాడుతామన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బండి దీప్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిరిగిరి వెంకట్‌రెడ్డి, గిరి లింగయ్యగౌడ్, నిమ్మల బీమార్జున్‌రెడ్డి, లెనిన్‌బాబు, ప్రసాద్, శివరామకృష్ణ, వెంకటరెడ్డి, స్వామిదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉమెన్స్ కాలేజీలో మెగా జాబ్‌మేళా



జాబ్ మేళాలో మాట్లాడుతున్న నిర్వాహకులు

నల్లగొండ : నల్లగొండలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం కార్తీకేయ సెక్యూరిటీ సర్వీసెస్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాకు ఉమ్మడి జిల్లా నుంచి దాదాపు 200 మంది విద్యార్థినులు హాజరయ్యారు. యాపిల్ సంస్థలో విడి భాగాలను సమకూర్చే ఉద్యోగాలకు విద్యార్థినులను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.17,200 వేతనం, ఉచిత హాస్టల్, క్యాంపస్ వసతి కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, టీఎస్ కేసి కోఆర్డినేటర్ రాంరెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ సుదర్శన్‌రెడ్డి, గ్రంథాలయ శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ సుంకరి రాజారామ్, ఆయేషా, ప్లేస్‌మెంట్ నిర్వాహకులు కెఎన్‌డి.మూర్తి, రేణుక పాల్గొన్నారు.

భూగర్భ జలశాఖను సంప్రదించాలి



మాట్లాడుతున్న జిల్లా అధికారి రేవతి

నార్కట్‌పల్లి : బోర్లు వేయాలనుకునే వారు ముందుగా భూగర్భ జలశాఖను సంప్రదిస్తే బోరువెల్ పాయింట్ కోసం శాస్త్రీయంగా సర్వే చేస్తుందని జిల్లా భూగర్భ జల శాఖ అధికారి కె.రేవత్ పేర్కొన్నారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా శనివారం నార్కట్‌పల్లి మండలం నెమ్మాని గ్రామంలో గల రైతువేదిక వద్ద జిల్లా భూగర్భ శాఖ-ప్రతిభ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో 'భూగర్భ జలాల సంరక్షణ-నీటి వినియోగం'పై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి అనంతరెడ్డి, మండల ప్రత్యేకాధికారి చరితారెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీఓ ఉమేష్, ఏఓ గౌతమ్, శ్వేత, మానస, రజని, కుమార్, లక్ష్మయ్య, రాకేష్‌రెడ్డి, జావెద్, నర్సింహ, మహేష్, యాదగిరి ఉన్నారు.

డ్రగ్స్ నిర్మూలనకు 2కే రన్

నల్లగొండ టౌన్ : గంజాయి, డ్రగ్స్ రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలని స్పెషల్ బ్రాంచి అదనపు ఎస్పీ రమేష్ పిలుపునిచ్చారు. శనివారం ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా 'సే నో టు డ్రగ్స్' అనే నినాదంతో ఎన్జీ కాలేజీ నుంచి బస్టాండ్ వరకు 2కే రన్ నిర్వహించారు. ఈ రన్‌ను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ యువత డ్రగ్స్, గంజాయి బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు ప్రభుత్వం, పోలీస్ శాఖ చేస్తున్న కృషిలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ భాగస్వామ్యం కావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మల్లం మహేష్, శంకర్, అనంతుల శంకరయ్య, ఆకారపు నరేష్, గుండాల నరేష్, కట్ట లింగస్వామి, అశోక్‌రెడ్డి, కార్తీక్, కిరణ్, కావ్య తదితరులున్నారు.



2కే రన్ చేస్తున్న ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు, పోలీసులు

మహిళలకే పనిముట్లు

మహిళా రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ

- ఈ నెలాఖరు వరకు గ్రౌండింగ్ చేయాలని ఆదేశాలు
- నియోజకవర్గాల వారీగా యూనిట్లు, నిధుల కేటాయింపు
- 50 శాతం రాయితీపై అందజేత



నల్లగొండ అగ్రికల్చర్ : వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను మహిళా రైతులకు రాయితీపై అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే 13 రకాల యాంత్రీకరణ పరికరాలు ఇవ్వాలని నిర్ణయించిన ప్రభుత్వం జిల్లాకు కోటి 81 లక్షల 36 వేల నిధులను కేటాయించడంతో పాటు 820 వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను ఇవ్వాలని నిర్ణయించింది. వీటన్నింటిని 50 శాతం రాయితీలో మహిళా రైతులకు మాత్రమే ఇవ్వాలని నిబంధన విధించడంతో పాటు ఈ నెలాఖరులోగా గ్రౌండింగ్ చేయాలని స్పష్టం చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యవసాయ శాఖ అన్ని నియోజకవర్గాల వారీగా పరికరాలను, నిధులను కలెక్టర్ ఇలా త్రిపాఠి అనుమతిలో కేటాయించారు. మండలాల వారీగా మహిళా రైతులను ఎంపిక చేయనున్నారు.

నియోజకవర్గాల వారీగా పరికరాలు, నిధుల ఇలా.. (రూ.లక్షల్లో..)

నియోజకవర్గం	పరికరాలు	నిధులు
నాగార్జునసాగర్	138	31.70
దేవరకొండ	134	30.05
మిర్యాలగూడ	139	27.83
మునుగోడు	119	22.44
నకిరేకల్	129	29.35
నల్లగొండ	140	36.83
తుంగతుర్తి (శాలిగౌరారం)	21	3.16
మొత్తం	820	181.36

లబ్ధిదారుల ఎంపిక కత్తిమీద సాము..

2018 నుంచి వ్యవసాయ యాంత్రికరణ పథకం నిలిచిపోయింది. దీంతో రైతులు వ్యవసాయ పరికరాలు కొనుగోలు చేయాలంటే నానా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ప్రస్తుత ప్రభుత్వం ఈ పథకాన్ని పునరుద్ధరించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాయితీ పరికరాల కోసం మహిళా రైతుల నుంచి తీవ్ర పోటీ ఏర్పడే అవకాశం ఉంది. దీంతో లబ్ధిదారుల ఎంపిక వ్యవసాయ శాఖ అధికారులకు కత్తిమీది సాములా మారనుంది. లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ నాయకుల జోక్యం ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుందనే అభిప్రాయాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. అర్హులైన రైతులను గుర్తించి ఎంపిక చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

లబ్ధిదారులను ఎంపిక చేస్తాం



వ్యవసాయ యాంత్రికరణ పరికరాల గ్రౌండింగ్‌ను ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. నియోజక వర్గాల వారీగా పరికరాలతో పాటు నిధుల కేటాయింపు పూర్తి చేశాం. త్వరలో మహిళా లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేసి పరికరాల గ్రౌండింగ్ చేస్తాం.

– పాల్వాయి శ్రవణ్‌కుమార్, డీఏఓ

బర్డ్‌ఫ్లూ రెడ్ అలర్ట్

ఉమ్మడి జిల్లాలోని కోళ్లఫారాల్లో వ్యాధి విజృంభణ

- గుండ్రాంపల్లి, దోతిగూడెం, నేలపట్ల గ్రామాల్లో లక్షల కోళ్లు పూడ్చివేత
- వేల కొద్ది గుడ్లు, టన్నుల కొద్ది ఫీడ్‌ను పూడ్చుతున్న అధికారులు
- ఫారాల సమీపంలో మూడు కిలోమీటర్లు రెడ్ జోన్‌గా ప్రకటన



నల్లగొండ అగ్రికల్చర్ : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బర్డ్ ఫ్లూ వ్యాధి కలకలం రేపుతోంది. వ్యాధి వ్యాప్తి పెరిగి లక్షలాది బ్రాయిలర్, లేయర్ కోళ్ల మృత్యువాత పడుతున్నాయి. బర్డ్‌ఫ్లూ సోకడంతో ఇప్పటికే భూదాన్‌పోచంపల్లి మండలం దోతిగూడెం, చౌటుప్పల్ మండలం నేలపట్లలోని పలు ఫారాల్లోని వేలాది కోళ్లను అధికారులు పూడ్చి వేయించారు. ప్రస్తుతం చిట్యాల మండలం ఏపూరు సమీపంలోని కోళ్ల ఫారాల్లో వ్యాధి నిర్ధారణ కావడంతో కోళ్లను పూడ్చి వేయిస్తున్నారు. జిల్లా పశు వైద్య సంవర్ధక శాఖ అధికారులు అప్రమత్తమై బర్డ్‌ఫ్లూ సోకిన కోళ్ల ఫారాలకు సమీప ప్రాంతాల్లో 3 కిలో మీటర్ల దూరం వరకు రెడ్ జోన్‌గా ప్రకటించారు. అక్కడి పరిసర ప్రాంతాలకు వ్యక్తులు, ఇతర వాహనాలు రానీయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

భోపాల్ ల్యాబ్‌లో తనిఖీలు..

చిట్యాల మండలం ఏపూరు సమీపంలోని కోళ్ల ఫారాల్లో పశు సంవర్ధక శాఖ తనిఖీలు నిర్వహించి శాంపిల్స్‌ను హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించగా కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకినట్లు అంచనాకు వచ్చారు. వాటి శాంపిళ్లను భోపాల్‌లోని నేషనల్ లెవెల్ హైసెక్యూరిటీ యానిమల్ డిసీజ్ సెంటర్‌కు పంపారు. ఫలితాల్లో బర్డ్‌ఫ్లూ నిర్ధారణ కావడంతో జిల్లా పశు సంవర్ధక శాఖ అప్రమత్తమైంది. ఇక్కడి కోళ్ల ఫారాల్లోని సుమారు 2 లక్షల లేయర్ కోళ్లతో పాటు వేలాది గుడ్లను, టన్నుల కొద్దీ ఫీడ్‌ను జేసీబీలతో గుంతలు తీయించి పూడ్చివేయిస్తున్నారు.

52 ఆర్ఆర్‌టీ బృందాలు ఏర్పాటు..

ఉమ్మడి జిల్లాలో బర్డ్‌ఫ్లూ ఉధృతి నేపథ్యంలో జిల్లా పశు సంవర్ధక శాఖ 52 ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను (ఆర్ఆర్‌టీ) ఏర్పాటు చేసింది. ఒక్కో బృందంలో డాక్టర్‌తో పాటు ఐదుగురు సిబ్బందిని నియమించింది. కోళ్ల శాంపిల్స్‌ను సేకరించేందుకు వీరందరికీ ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. ఎక్కడైనా బర్డ్‌ఫ్లూ లాంటి లక్షణాలు ఉన్నాయనే సమాచారం అందిన వెంటనే ఈ బృందాలు అక్కడికి వెళ్లి పీపీఈ కిట్లను ధరించి శాంపిల్స్ సేకరించి భోపాల్ ల్యాబ్‌కు పంపనున్నారు.

బర్డ్‌ఫ్లూ వ్యాప్తి చెందకుండా చూస్తాం



మాట్లాడుతున్న పశుసంవర్ధకశాఖ జేడీ రమేష్

చిట్యాల: బర్డ్‌ఫ్లూ వ్యాప్తి చెందకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ రమేష్ పేర్కొన్నారు. చిట్యాల మండలం ఏపూరు పరిధిలోని వీఎస్ఆర్ కోళ్ల ఫారాన్ని శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం గుండ్రాంపల్లి గ్రామంలోని పశు వైద్యాశాలలో విలేకరులతో మాట్లాడారు. ఏపూరు వీఎస్ఆర్ కోళ్ల ఫారాల్లో బర్డ్‌ఫ్లూ రావటంతో సుమారు రెండు లక్షల కోళ్లను నిర్మూలించనున్నట్లు తెలిపారు. మిగిలి ఉన్న కోళ్ల దాణా కాల్చివేయటంతో పాటు కోళ్లఫారాలను పూర్తిస్థాయిలో శానిటైజ్ చేయాలని యజమానులకు ఆదేశాలిచ్చామని తెలిపారు. బర్డ్‌ఫ్లూ నిర్ధారణకుగాను డివిజన్‌కు ఒక ప్రత్యేక పశువైద్య బృందాన్ని ఏర్పాటు చేసి కోళ్ల ఫారాలను తనిఖీ చేస్తున్నామన్నారు. బర్డ్‌ఫ్లూ సోకని చికెన్‌ను ఎలాంటి అనుమానాలు లేకుండా తీసుకోవచ్చునని సూచించారు. సమావేశంలో చిట్యాల, ఉరుమడ్ల పశువైద్యాధికారులు అభినవ్, అమరేందర్ పాల్గొన్నారు.

పరీక్షలు సజావుగా నిర్వహించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

హాలియా : పదో తరగతి పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శనివారం హాలియా పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని ఆమె ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి తనిఖీ చేశారు. పరీక్షకు హాజరైన విద్యార్థుల వివరాలతో పాటు కేంద్రంలో సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద భద్రతను పకడ్బందీగా నిర్వహించాలని, ఎట్టి పరిస్థితిలోనూ ఇతరులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించవద్దని పేర్కొన్నారు. వారి వెంట మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్, డీఎస్పీ రాజశేఖరరాజు, సీఐ జనార్దన్‌గౌడ్, ఎంఈఓ కృష్ణమూర్తి, ఎస్ఐ సతీష్‌రెడ్డి ఉన్నారు.



హాలియాలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

39 మంది గైర్హాజరు

నల్లగొండ : పదో తరగతి పరీక్షల రెండోరోజు శనివారం జిల్లా వ్యాప్తంగా 39 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 105 పరీక్ష కేంద్రాల్లో శనివారం జరిగిన పరీక్షకు మొత్తం 18,553 మంది విద్యార్థులకుగాను, 18,514 మంది హాజరయ్యారు. 39 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

నకిరేకల్‌లో పోలీస్ పహారా నడుమ పరీక్షలు

నకిరేకల్: పేపర్ లీకేజీతో సమస్యాత్మకంగా మారిన నకిరేకల్ పట్టణంలోని అన్ని పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ పహారా నడుమ శనివారం పరీక్షలు జరిగాయి. పట్టణంలోని నాలుగు పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి పోలీసులు పహారా కాశారు. ప్రత్యేకించి శుక్రవారం ప్రశ్నపత్రం లీకేజీ అయిన ఎస్సీ గురుకుల సెంటర్‌కు చీఫ్ సూపరింటెండెంట్‌గా నకిరేకల్ మండలం మంగళపల్లి జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం వీరారెడ్డి, డిపార్ట్‌మెంటల్ అధికారిగా కట్టంగూరు మండలం మునుకుంట్ల జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం షమీదాబేగంను నియమించారు. ఈ కేంద్రంలో జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్, నల్లగొండ ఎంఈఓ అరుంధతి మకాం వేసి పర్యవేక్షించారు. నకిరేకల్ తహసీల్దార్ జమురుద్దీన్, ఎంఈఓ నాగయ్య పరీక్ష కేంద్రాలను సందర్శించారు. నకిరేకల్ సీఐ రాజశేఖర్, ఎస్ఐలు సురేష్, లచ్చిరెడ్డి సిబ్బందితో గస్తీ నిర్వహించారు. నాలుగు కేంద్రాల్లో మొత్తం 747 మంది విద్యార్థులకు గాను 745 మంది పరీక్షకు హాజరయ్యారు. ఇద్దరు గైర్హాజరయ్యారు.



గురుకుల పాఠశాల ఎదుట పోలీస్ పహారా

షోకాజ్ నోటీసులు జారీ..

నకిరేకల్‌లో గురుకల పాఠశాల పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌గా ఉన్న పోతులు గోపాల్, డిపార్ట్‌మెంటల్ అధికారి రామ్మోహన్‌రెడ్డిని శుక్రవారమే విధుల నుంచి తొలగించిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై సంజాయిషీ ఇవ్వాలని కోరుతూ శనివారం వారికి జిల్లా విద్యాధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పేపర్ లీక్ అయిన గది ఇన్విజిలేటర్‌గా ఉన్న ఇదే గురుకుల పాఠశాలలో టీజీటీ సుధారాణిని శుక్రవారమే సస్పెండ్ చేశారు.

ప్రత్యేక ప్రజావాణి దరఖాస్తులపై శ్రద్ధ చూపాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : వృద్ధులు, దివ్యాంగుల ప్రత్యేక ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారంపై అధికారులు శ్రద్ధ చూపాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రత్యేక ప్రజావాణిలో కలెక్టర్‌కు 74 మంది దరఖాస్తులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొంతమంది జిల్లా అధికారులు, ఆర్డీఓలు దరఖాస్తుపై స్పెషల్ గ్రీవెన్స్ అని రాస్తే త్వరగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయన్, ఇన్‌చార్జి డీఆర్ఓ వై.అశోక్ రెడ్డి, ఆర్డీఓలు రమణారెడ్డి, శ్రీదేవి, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజకుమార్ పాల్గొన్నారు.



గ్రీవెన్స్ డేలో బాధితుల గోడు వింటున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నా బిడ్డ భూమి తీసుకుంది.. పట్టించుకోవడం లేదు



నాకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. 7 ఎకరాల 23 గుంటల భూమి ఉంది. నా కొడుకులే 7 ఎకరాల భూమిని నా బిడ్డకు అమ్మారు. 23 కుంటల భూమిని నా పేరున ఉంచారు. నన్ను చూసుకుంటానని చెప్పి ఆ 23 కుంటల భూమిని కూడా నా కూతురే పట్టా చేయించుకుంది. ఇప్పుడు పట్టించుకోవడం లేదు. అడిగితే తిడుతోంది. కొడుకుల వద్దకు పోతే భూమి బిడ్డకు ఇచ్చావు అని పట్టించుకోవడం లేదు.

– లింగయ్య, చిన్నకాపర్తి, చిట్యాల మండలం

పరిహారం పెంచేలా చూడండి



మాకు నలుగురు కొడుకులు. ప్రతి నెలా ఒకొక్కరు రూ.2500 చొప్పున 10 వేలు కొడుకులు ఇస్తున్నారు. చిన్న కొడుకు చనిపోయాడు. ఇప్పుడు రూ.7500 వస్తున్నాయి. అయితే పెద్ద కొడుకు టీచర్ అయినా ప్రతి నెల ఆలస్యంగా ఇస్తున్నాడు. కెనడాలో ఉండే కొడుకు, హైదరాబాద్‌లో ఉండే కొడుకు సమయానికి పంపిస్తున్నారు. కానీ ఆ రూ.7500 మా మందులకే సరిపోవడం లేదు. ఒకొక్కరి నుంచి రూ.5 వేల చొప్పున ఇప్పించాలి.

– కేసాని లింగారెడ్డి–పద్మ, కొడతాలపల్లి, త్రిపురారం మండలం

పింఛన్ ఇప్పించండి



నేను దివ్యాంగుడిని. మా అమ్మ కూడా మానసిక దివ్యాంగురాలు. నాన్న లేడు. అమ్మకు గతంలో వృద్ధాప్య పింఛన్ వచ్చింది. ప్రస్తుతం ఆగిపోయింది. దాంతో మాకు కుటుంబం గడవడం కష్టంగా ఉంది. మా అమ్మకు పింఛన్ ఇప్పించాలి.

– సాలోజు నాగయ్య, తడకమళ్ల, మిర్యాలగూడ మండలం

సౌర విద్యుత్ అవగాహన సదస్సు గందరగోళం



అవగాహన సదస్సులో పాల్గొన్న అధికారులు, రైతులు

నల్లగొండ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న పీఎం కుసుమ్ కాంపోనెంట్ ఏ పథకంపై శనివారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమం గందరగళం గా మారింది. ఈ పథకం కింద సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు కోసం నిర్వహించే సదస్సును నల్లగొండలోని విద్యుత్ ఎస్ఈ చాంబర్‌లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి విద్యుత్ అధికారులతో పాటు నెడ్‌క్యాప్ అధికారి, లీడ్ బ్యాంకు అధికారులు, రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున వచ్చారు. దీంతో అక్కడ చాంబర్ సరిపోక.. అధికారుల తీరుపై రైతులు మండిపడ్డారు. పైగా విద్యుత్ శాఖ ఎస్ఈ కూడా ఈ సమావేశానికి రాలేదు. అవగాహన సదస్సు కోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ప్రధాని ఫొటో కూడా పెట్టకపోవడంతో తీవ్ర గందరగోళ పరిస్థితి ఏర్పడింది. దీంతో చేసేది లేక అధికారులు సమావేశాన్ని రద్దు చేసి సాయంత్రం కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో ఏర్పాటు చేశారు. రూ.2 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసే ఈ సోలార్ ప్లాంట్లపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు అనువజ్ఞులైన అధికారులు కూడా లేరు. దీంతో సదస్సును నామమాత్రంగా ముగించారంటూ రైతులు, నాయకులు ఆరోపించారు. పథకంపై అవగాహన కల్పించలేనప్పుడు సమావేశం పెట్టడం దేనికంటూ ప్రశ్నించారు. కార్యక్రమంలో నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి, నెడ్ క్యాప్ అధికారి పాండురంగారావు పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్లు నిర్మించాలని పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

మిర్యాలగూడ : అద్దంకి– నార్కట్‌పల్లి రహదారిపై మిర్యాలగూడ బైపాస్‌లో ఫ్లైఓవర్ బ్రిడ్జిలను వెంటనే నిర్మించాలని సీపీఎం ఆధ్వర్యంలో శనివారం బైపాస్‌లోని వై జంక్షన్ వద్ద నుంచి నందిపాడు చౌరస్తా మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్ర చేశారు. కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ వై జంక్షన్, నందిపాడు చౌరస్తా, రవీంద్రనగర్ క్రాస్‌రోడ్డు, చింతపల్లి బైపాస్, ఈదులగూడ వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు నిర్మిస్తామని ఆరు నెలల క్రితం మంత్రి కోమటిరెడ్డి శంకుస్థాపన చేశారని, కానీ ఇంతవరకు పనులను మొదలు పెట్టలేదన్నారు. వెంటనే పనులు ప్రారంభించకుంటే నిరాహార దీక్షలు చేపతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, జగదీశ్చంద్ర, గాదె పద్మ, రవినాయక్, గౌతంరెడ్డి, మంగారెడ్డి తదితరులున్నారు.

EAPCET/NEET/TSRJC/Polycet కోచింగ్
IIT - NEET ACADEMY
ALPHA JUNIOR COLLEGE
Ramagiri, Nalgonda
EAPCET/NEET Classes Starts from 24-03-2025
TSRJC/Polycet Classes From 04-04-2025
బాలబాలికలకు వేరు వేరుగా హాస్టల్ వసతి కలదు.
Cell: 9848628045, 9848105500